క్లుప్తంగా

నరసింహస్వామికి స్వాతి నక్షత్ర పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహస్వామి

నంద్యాల(వ్యవసాయం): స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక తెలుగుపేటలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, స్నపన తిరుమంజనం చేపట్టారు. అనంతరం స్వామి వారిని తులసీమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహామంగళ హారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇదే ఆలయంలో వెలసిన శ్రీలక్ష్మీదేవి అమ్మవారికి ఉదయం దీపావళి అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన చేశారు.

రూ.6.23 లక్షలతో సీసీ కెమెరాలు

ఉయ్యాలవాడ : మండలంలో నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి చొరవతో ఎంపీ నిధులతో రూ. 6.23 లక్షలు వ్యయం చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో 12 సీసీ కెమెరాలు, ఇంజేడు, ఆర్.పాంపల్లె, మాయలూరు, కొండుపల్లె, సర్వాయిపల్లె, బోడెమ్మనూరు గ్రామాల్లో ఒక్కో గ్రామంలో 4 చొప్పున కెమెరాలు ఏర్పాటు చేసి వైఫై ద్వారా కనెక్షన్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సీసీ కెమెరాలు అమర్చడంతో గ్రామాల్లో ఏదైనా సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు వెంటనే వాటి వివరాలను వెలికి తీసేందుకు దోహదపడుతాయని ఎస్ఐ స్పష్టం చేశారు.

నేడు బోడెమ్మనూరులో 'పల్లెకు పోదాం'

ఉయ్యాలవాడ: మండలంలోని బోడెమ్మనూరు గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం సాయంత్రం 3 గంటలకు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాల బోర్డులను ప్రదర్శించి, సమస్యలుంటే ప్రజల నుంచి గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

తెలుగు వారి శ్రేయస్సే ధ్యేయం


విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

శిరివెళ్ల: ప్రపంచంలో తెలుగు వారు ఎక్కడున్నా వారి శ్రేయస్సుకు పాటు పడుతున్నామని తా నా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ అన్నారు. సోమవారం తన స్వగ్రామమైన రాజనగనంలో వంద మంది బాల బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బస్ సౌకర్యంలేని పేద విద్యార్థులకు సైకిళ్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆదరణ కింద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్ చేస్తున్న వంద మంది విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు, విజయవాడలో 50 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేశామన్నారు. అలాగే చేయూత కింద మరో వెయ్యి మంది పేద ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.20 వేల చొప్పున ఉపకార వేతనాల పంపిణీ చేస్తున్నామని చెప్పారు. నంద్యాల జిల్లాలో త్వరలో వంద మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయాలని సన్నాహాలు చేస్తున్నామన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీపింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి ఆర్.ఈ. శ్రీధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 15న పుస్తక పఠనం, ప్రదర్శనపై అవగాహన సదస్సు, 16న గ్రంథాలయ ఉద్యమకర్తల సేవల సంస్మరణ, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు, 19న ఝాన్సీలక్ష్మీబాయ్,ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, 20న సామూహిక స్వీయ పఠనంపై అవగాహన సదస్సుతో ముగుస్తాయని, పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని వివరించారు.

ఆర్థిక సాయం

చాగలమర్రి: ఈ నెల 23వ తేదీ నుంచి పంజాబ్‌లో జగరుగనున్న జాతీయ బేస్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్న మండల కేంద్రానికి చెందిన క్రీడాకారులు అబుబక్కర్, అల్తాఫ్, జుబేర్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుడు ముల్లా షబ్బీర్ సోమవారం రూ.15 వేలు అందజేశారు. వారు పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని తన కార్యాలయంలో అందజేశారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రానికి, సొంతూరికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

స్మార్ట్ ఓపీ

- స్మార్ట్ ఫోన్‌లో 'అభా' యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు
- ఓపీ కోసం క్యూలో వేచి ఉండక్కర్లేదు
- రోగి చికిత్స వివరాలు సర్వర్‌లో నమోదు
- సులభతరం అవుతున్న వైద్య సేవలు

డిజిటల్ యుగంలో వైద్య సేవలు కూడా అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకున్నాయి. చికిత్స పొందటం ఒక ఎత్తయితే.. ఓపీ పొందడం మరో ఎత్తు. ఓపీ కోసం రోగులు, వారి సహాయకులు నిరీక్షణకు తెరదించాలని ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. కేవలం అభా యాప్ లేదా క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాలు నమోదు చేయడం ద్వారా ఓపీ రిజిస్ట్రేషన్ పూర్తయ్యి డాక్టర్ అపాయింట్‌మెంట్ పొందే విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రుల్లో నూతన సేవలు అందుబాటులోకి వచ్చాయి.

నంద్యాల టౌన్: మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రజలకు మరింత సరళమైన పద్ధతిలో సేవలు అందించేదుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుంది. ఇందులో భాగంగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా అవుట్ పేషెంట్ (ఓపీ) రిజిస్ట్రేషన్ పూర్తి చేసి డాక్టర్ అపాయింట్‌మెంట్ టోకెన్ పొందే నూతన పద్ధతిని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులోకి తెచ్చింది. డిజిటలైజేషన్‌లో భాగంగా అభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) యాప్‌లో రోగి వివరాలను నమోదు చేసి వైద్యం పొందే సేవలు ఇటీవల ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రారంభమయ్యాయి. ఈ విధానంపై ఇప్పటికే ఆస్పత్రి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటుతో పాటు క్యూఆర్ కోడ్ పోస్టర్లు, ఓపీ రిజిస్ట్రేషన్ ఎలా చేసుకోవాలో అవగాహన కల్పించేలా పోస్టర్లు ఏర్పాటు చేశారు.

నిరీక్షణకు చెక్..

దేశవ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో సేవలు పొందే రోగుల వివరాలను నేషనల్ హెల్త్ రికార్డ్స్ లో పొందుపరిచేందుకు ఆన్‌లైన్ అవుట్ పేషంట్ (ఓపీ) విధానాన్ని విస్తరిస్తున్నారు. క్యూలో వేచి ఉండే సమయాన్ని ఈ విధానం ద్వారా ఆదా చేసుకోవచ్చు. సాధారణంగా వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తే తొలుత ఓపీ కౌంటర్ లో వివరాలను నమోదు చేయించుకోవాలి. రోగి పేరు, చిరునామా, ఫోన్ నంబర్, వ్యాధి తదితర వివరాలను వెల్లడించాలి. అనంతరం సంబంధిత విభాగానికి రోగికి ఓపీ టోకెన్ ఇస్తారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు కనీసం 5 – 10 నిమిషాలు పడుతుంది. పెద్దాస్పత్రుల్లో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుండటంతో రోగులు, సహాయకులు గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. అదే క్యూఆర్ కోడ్ ద్వారా ఓపీ రిజిస్ట్రేషన్ చేసుకుంటే నేరుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌కు వెళ్లి టోకెన్ తీసుకుని డాక్టర్‌ను సంప్రదించవచ్చు. దీంతో క్యూలో నిరీక్షించే అగచాట్లు తప్పుతాయి.

సర్వజన ఆసుపత్రిలో..

పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సర్వజన ఆసుపత్రిగా మారిన తరువాత అధునాతన పరికరాలు ఏర్పాటు చేయడంవల్ల వైద్య సౌకర్యాలు మెరుగుపడటంతో చికిత్స కోసం వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రత్యేకంగా రూ.5 కోట్లతో ఓపీ భవనాన్ని నిర్మించింది. ఓపీ కోసం వచ్చేవారికి ఈ భవనంలోనే ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. సోమ, బుధ, గురు వారాల్లో రోగుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పెరుగుతున్న రోగులకు ఓపీ జారీ కోసం కౌంటర్లు పెంచాలనే విజ్ఞప్తులు రావటంతో.ప్రస్తుతం ఉన్న ఓపీ భవనం పక్కనే ఓపీ రిజిస్ట్రేషన్‌కు నాలుగు ప్రత్యేక కౌంటర్లతో నూతనంగా కౌంటర్లు నిర్మించారు. ఇందులో అత్యవసర, ఐపీ విభాగాలకు, స్త్రీ, పురుషులకు, గర్భిణులు, దివ్యాంగులకు వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు గంటల వరకు ఓపీ సేవలు అందిస్తున్నారు. సర్వజన ఆసుత్రికి ప్రతి రోజూ దాదాపు 1,400 మంది ఓపీ కోసం వస్తుంటారు. వీరిలో 200 నుంచి 300 వరకు ఇన్ పేషంట్ల కోసం కేసు షీట్లను జారీ చేస్తున్నారు. ఆన్‌లైన్ ఓపీతో సమయం ఆదా అవడంతో పాటు రోగికి వేచి ఉండే అవస్థలు తగ్గుతున్నాయి. ఆన్‌లైన్ విధానంపై అవగాహన లేని వారు తమ ఫోన్ నంబరుతో అక్కడే ఉన్న వైద్య సిబ్బందిని సంప్రదిస్తే. వారు తమ ఫోన్‌లో ఉన్న అభా యాప్‌లో రోగి వివరాలు నమోదు చేసి ఓపీ ఇస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా స్త్రీ, పురుషులకు విడివిడిగా కౌంటర్లు ఏర్పాటు చేశారు.

నమోదు ఇలా..

స్మార్ట్ ఫోన్‌లో ప్లేస్టోర్ ఓపెన్‌చేసి ఏబీహెచ్ఏ (అభా) యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి. ఆయుష్మాన్ డిజిటల్ హెల్త్ అకౌంట్ 14 అంకెల గుర్తింపు/ఫోన్ నంబర్/మెయిల్ ఐడీ ద్వారా రిజిస్టర్ అవ్వాలి. లాగిన్ అయిన వెంటనే అభా వివరాలు ప్రత్యక్షం అవుతాయి. వీటిని ఆస్పత్రితో షేర్ చేసే ఆప్షన్ కనిపిస్తుంది. షేర్ ఆప్షన్ పై క్లిక్ చేస్తే టోకెన్ నంబర్ వస్తుంది. ఈ టోకెన్ 30 నిమిషాల పాటు చెల్లుబాటు అవుతుంది. టోకెన్ నంబర్ వచ్చాక ఆస్పత్రిలో కౌంటర్‌కు వెళ్లి అభా గుర్తింపు నంబర్, ఫోన్ నంబర్ తెలియజేసి ఏ స్పెషాలిటీలో ఓపీ అవసరమో చెబితే వైద్య సిబ్బంది టోకెన్ ఇస్తారు. దీన్ని తీసుకుని నేరుగా డాక్టర్‌ను సంప్రదించవచ్చు. సాంకేతిక సమస్య లేకపోతే ఇదంతా రెండు నిమిషాల్లో పూర్తవుతుంది. ఆస్పత్రికి వెళ్లే ముందే వివరాలు నమోదు చేస్తే ఓపీ కౌంటర్ వద్ద పని సులువవుతుంది. ఒకసారి యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు.. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు పొందవచ్చు. ఈ విధానంపై అవగాహన కల్పించేందుకు ఓపీ కౌంటర్ల వద్ద వైద్య సిబ్బందిని నియమించారు. స్మార్ట్ ఫోన్ లేని వారు సిబ్బందిని సంప్రదిస్తే ఓపీ చీటీ ఇస్తున్నారు.


ఓపీ కోసం క్యూలో నిల్చున్న మహిళలు


రోగి సహాయకుల నుంచి వివరాలు తీసుకుని ఓపీ రిజిస్ట్రేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది

'అభా'తో రోగికి సమయం ఆదా



అభా యాప్ వల్ల రోగికి సమయం ఆదా అవుతుంది. ఒకసారి డౌన్లోడ్ చేసుకుంటే చాలు.. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు పొందవచ్చు. ఈ యాప్‌పై రోగులకు అవగాహన కల్పించేందుకు సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం.

– డాక్టర్ వరప్రసాద రావు, సూపరింటెండెంట్, నంద్యాల ప్రభుత్వాసుపత్రి

క్యూలైన్ బాధలు తప్పాయి



మా నాన్నకు ఆరోగ్యం బాగా లేక నంద్యాల ఆసుపత్రికి వచ్చాం. ఆన్‌లైన్ ఓపీ తీసుకోవడంతో త్వరగా చికిత్స చేయించుకోగలిగాం. ఒకపుడు ఓపీ కోసం గంటల తరబడి క్యూలో నిలబడే వాళ్లం. ఇపుడు స్మార్ట్‌ఫోన్‌లో అభా యాప్ డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేసుకుంటే నిమిషాల్లోనే ఓపీ రిజిస్ట్రేషన్ అయిపోతుంది. రోగులకు వారి సహాయకులకు ఈ విధానం ద్వారా సమయం ఆదా అవుతుంది. చికిత్స త్వరగా చేయించుకునేందుకు వీలుంటుంది.

– శివ ప్రసాద్ రెడ్డి, కొత్తపల్లి

కార్తీకం.. శుభప్రదం

- నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం


విద్యుద్దీపాలంకరణలో ప్రథమనందీశ్వర స్వామి ఆలయం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఆలయాలు కార్తీక శోభను సంతరించుకోనున్నాయి. మంగళవారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుండటంతో అన్ని ఆలయాల్లో మహాన్యాస పూర్వక ఏక వార ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకాలు, సాయంత్ర వేళల్లో ప్రదోషకాల పూజలతో పాటు, ఆకాశ దీపం, అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించడానికి నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు. ప్రథమనంది దేవస్థానంలో ప్రతిరోజు స్వామి వారికి అభిషేకాలు, మధ్యాహ్నం శివ, అయ్యప్ప స్వామి దీక్షాధారులకు అన్నదానం, సాయంత్రం ప్రదోషకాల పూజలతో పాటు ఆకాశ దీపం కార్యక్రమం నిర్వహించనున్నారు. నవనందుల్లో సోమనంది, నాగనంది, బ్రహ్మనందీశ్వర స్వామి దేవాలయం, మల్లికార్జునస్వామి దేవస్థానం , నూనెపల్లె శివాలయం, పట్టణంలోని పలు శివాలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

అధైర్య పడొద్దు..పంటలకు నీరిస్తాం

- కేసీ కెనాల్‌ను పరిశీలించిన గంగుల ప్రభాకర్‌రెడ్డి


దొర్నిపాడులోని 24వలాక్ వద్ద అధికారులతో గంగుల ప్రభాకర్‌రెడ్డి

దొర్నిపాడు: రైతన్నలూ.. అధైర్య పడొద్దు.. సాగు చేసిన పంటలన్నింటికీ నీరిస్తాం అని రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి అన్నదాతలకు ధైర్యం చెప్పారు. సోమవారం మండలంలోని రామచంద్రాపురం 25వ లాక్ నుంచి 16వ లాక్ వరకు కేసీ కెనాల్‌లో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 16వ లాక్ వద్ద 6.7 అడుగుల మేర నీరు ప్రవహిస్తుండగా.. దొర్నిపాడులోని 23వ లాక్ వద్ద 2.5 అడుగుల వరకు ప్రవాహం ఉందన్నారు. 16వ తేదీ రాత్రికి నీటి మట్టం తగ్గనుందని, ఇంకా 2.5 అడుగులు పెంచాలని అధికారులను సూచించామని చెప్పారు. నీటి విడుదలను మరో రెండు రోజులు పెంచాలని రైతులు కోరుతున్నారని, ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ ఎస్ఈ, నంద్యాల, శ్రీశైలం ఎమ్మెల్యేలతో చర్చించి నీటిని సర్దుబాటు చేసేందుకు ప్రయతిస్తామన్నారు. ఈ వంతులోనే పంటలన్నీ తడిచేలా చూడాలని అధికారులకు సూచించామని, ఈమేరకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. రైతులు సంతోషంగా ఉండాలనే సుంకేసుల, ముచ్చుమర్రి నుంచి పంపింగ్ చేసి నీటిని తీసుకరాగల్గుతున్నామన్నారు. మరో రెండు వంతులు నీరు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. మరో రెండు రోజుల్లో వర్షం కూడా కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ విభాగం అధికారులు చెబుతున్నారని, వర్షం వస్తే సమస్య తీవ్రత తగ్గుతుందన్నారు. ఈఈ తిరుమలేశ్వరరెడ్డి, డీఈ దశరథరామిరెడ్డి, ఏఈ రమేష్, ఎంపీపీలు అమర్‌నాథ్‌రెడ్డి, గజ్జల రాఘవేంద్రారెడ్డి, సొసైటీ చైర్మన్ భూమా వెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, నాయకులు మోహన్‌నాయుడు, శివరామిరెడ్డి, వెంకటస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, డీలర్ శివుడు, యాదవాడ నరసింహారెడ్డి, శ్రీపతి ప్రసాద్, శివనాగిరెడ్డి ఉన్నారు.

పంటలను రక్షిస్తాం

శిరివెళ్ల: కేసీ కెనాల్ కింద సాగైన ఆరుతడి, మెట్ట పంటలను రక్షిస్తామని జల వనరుల శాఖ సలహాదారుడు గంగుల ప్రభాకరరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కేసీ కెనాల్ 16వ లాక్ వద్దకు చేరుకొని నీటి మట్టంను పరిశీలించారు. ప్రస్తుతం 1వ లాక్ వద్ద ఆరున్నర అడుగుల మేర నీరు ప్రవహిస్తుందని, దానిని అలాగే కొనసాగించాలని రైతు సంఘం నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి గంగులను కోరారు. కాలువ కింద సాగైన అన్ని పంటలను కాపాడటానికి కృషి చేస్తామని గంగుల చెప్పారు.

యాగంటిలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే పూజలు


ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామిని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి, ఈఓ చంద్రశేఖరెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఏకశిలారూపంలో కొలువైన శివ పార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఎమ్మెల్యే దంపతులను పూలమాల, దుశ్శాలువా వేసి ఘనంగా సన్మానించి స్వామి వారి ప్రసాదం అందజేశారు. అనంతరం యాగంటి క్షేత్ర కార్తీకమాసోత్సవ ఆహ్వాన పత్రికలను ఈఓ, చైర్మన్‌లు అందజేసి ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు.

సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత


గోశాలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ : దేశ సంస్కృతి సంప్రదాయం, సనాతన ధర్మపరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అహోబిలం దేశస్థాన ముద్రకర్త శ్రీ మాన్ శఠకోప కిడాంబి వేణుగోపాలన్ అన్నారు. దిగువ అహోబిలం దేవాలయ ఆవరణలోని అహోబిలం మఠంలో నూతనంగా నిర్మించిన గోశాలను ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గోసంరక్షణ, స్త్రీ ఆరోగ్యంతోనే జాతికి, సమాజానికి, కుటుంబానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రత్యేకాధికారి శివప్రసాద్ ఉన్నారు.

శివస్వాములకు వస్త్రాల అందజేత

నంద్యాల(వ్యవసాయం): శివ దీక్ష తీసుకుంటున్న పేద మాలధారులకు సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం శివ దీక్ష వస్త్రాలు అందజేశారు. చింతలపల్లె వాసు మాట్లాడుతూ కార్తీక మాసంలో శివ దీక్ష తీసుకునే మాలధారులు పది మందికి దీక్షా వస్త్రాలు, సామగ్రిని హరి, చలం బాబు అందజేశారని చెప్పారు.

మహిళలను చైతన్యవంతం చేసేందుకే మహాసభలు

నంద్యాల(న్యూటౌన్): మహిళలను అన్ని రంగాల్లో రాణించేలా చైతన్య పరిచేందుకే రాష్ట్ర మహాసభలు నంద్యాలలో జరుపుతున్నామని సీపీఐ సహాయ కార్యదర్శులు సోమన్న, శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ప్రచారం చేశారు.

అడవుల సంరక్షణపై అవగాహన

రుద్రవరం:అడవులు,అందులో సంచరించే వన్య ప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నూతల సెక్షన్ అధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.మండలంలోని టీ.లింగదిన్నెలో చైతన్య ప్రచార రథం వాహనం ద్వారా ప్రజలకు అడవులు,వన్య ప్రాణుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న రైతులు పొలాల చుట్టూ ఉచ్చులు, వలలు వంటివి అమర్చి వన్య ప్రాణులకు ప్రమాదం తలపెట్టొద్దని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ ఇళ్లవద్ద ఓ మొక్కను నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. ఎఫ్‌బీఓలు రామకృష్ణ,సురేంద్రగౌడ్ ఉన్నారు.

19న హిందూ సమ్మేళనం

నంద్యాల(వ్యవసాయం): ఈ నెల 19వ తేదీన సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణా రెడ్డి, నగర కన్వీనర్ చింతలపల్లె వాసు తెలిపారు. సోమవారం రామకృష్ణ డిగ్రీ కళాశాలలో వారు పోస్టర్లను విడుదల చేసి మాట్లాడుతూ కార్యక్రమానికి శివస్వామి, శ్రీనివాసమూర్తి, శ్రీ శివయోగేంద్ర సరస్వతి స్వామి పాల్గొంటారని చెప్పారు. ఉదయం పట్టణంలో భజన బృందాలతో శోభాయాత్ర నిర్వహించిన అనంతరం వివేకానంద ఆడిటోరియంలో సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. బాలవీరయ్య, సత్యంరెడ్డి, రవీంద్ర కుమార్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, రమేష్ పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం


యోగా శిక్షణలో పాల్గొన్న పోలీస్ సిబ్బంది

బొమ్మలసత్రం: యోగా చేయటం వల్ల పనిఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుందని నంద్యాల దిశ డీఎస్పీ మారుతీరావు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో జిల్లా కేంద్రంలో పనిచేసే పోలీసులకు యోగా శిక్షణ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయటం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు సాత్విక గుణం లభిస్తుందన్నారు. ప్రముఖ యోగా గురువు రామ్‌దేవ్‌బాబా శిష్యుడు విజయవాడకు చెందిన మణికుమార్ శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ డీఎస్పీ రామాంజినాయక్, సిబ్బంది పాల్గొన్నారు

విజయవంతం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈ నెల 15న విజయవాడలో జరిగే ప్రజా రక్షణభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం సీపీఎం కార్యాలయం నుంచి చేపట్టిన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజాకార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన సభకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకోవాలని, రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని, రుణాలు మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నరసింహులు, గౌస్, లక్ష్మణ్, కొప్పెర సుబ్బరాయుడు, తోట మద్దులు, రామరాజు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీకాళికాంబ దేవి


సంజీవనగర్ రామాలయంలో విశేష అలంకరణలో శ్రీమహాలక్ష్మీ దేవి


సంజీవనగర్ రామాలయంలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

భక్తిశ్రద్ధలతో దీపావళి

నంద్యాల(వ్యవసాయం): చెడుపై మంచి సాధించిన విషయానికి గుర్తుగా దీపావళి పండుగ వేడుకలను సోమవారం పిల్లలు, పెద్దలు వైభవంగా నిర్వహించుకున్నారు. మహిళలు మంగళస్నానాల అనంతరం ధనలక్ష్మి వ్రతం నిర్వహించారు. పట్టణంలో దుకాణదారులు లక్ష్మీపూజను ఘనంగా నిర్వహించి ఆర్థిక లావాదేవీల పుస్తకాలను ప్రారంభించారు. స్థా నిక సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీమహాలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేపట్టారు.ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, అర్చనలు జరిపించి శ్రీలక్ష్మీనారాయణ హృదయ హోమం నిర్వహించారు. సాయంత్రం మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక ధనలక్ష్మి పూజ, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు జరిగాయి. చంద్రశేఖర కాళికాంబ దేవస్థానంలో దీపావళి అమావాస్యను పురస్కరించుకొని అమ్మవారికి విశేష పూజలు చేశారు.

దొర్నిపాడు: మండలంలో దీపావళి పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఇంటి ముంగిళ్లలో దీపాలు వెలిగించి బాణా సంచా పేల్చి తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. ఆది, సోమ రెండు రోజులు పండుగ చేసుకున్నారు.

మంచి చేసినందుకే ప్రజల వద్దకు వెళ్తున్నాం


చాగలమర్రిలో మహిళలకు బ్రోచర్లు అందజేస్తున్న దృశ్యం

చాగలమర్రి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అర్హులందరికీ పారదర్శకంగా అందజేస్తుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, వారికి ఆయన మేలు చేసిన కారణంగానే తాము నేడు ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి వివరిస్తున్నామని ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్ అన్నారు. స్థానిక 2వ సచివాలయం పరిధిలోని 6వ వార్డులో సోమవారం పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రగతి, సంక్షేమ పథకాలను వివరించే కర పత్రాలను అందజేశారు. వార్డు సభ్యులు మన్సూర్, పీఎంసీ చైర్మన్ కె.అబ్దుల్లా, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పార్కింగ్ టెండర్ రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): స్థానిక రైల్వే స్టేషన్‌లో కాంట్రాక్టు పార్కింగ్ టెండర్‌ను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబ ఫక్రుద్దీన్ రైల్వే అధికారులను కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నంద్యాల రైల్వే స్టేషన్ ఆవరణలో వాహనదారుల పట్ల అసభ్యకరంగా మాట్లాడుతూ పార్కింగ్ వసూలు చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకువాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై రైల్వే స్టేషన్ మేనేజర్, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. నంద్యాల రైల్వేస్టేషన్‌కు నిత్యం ప్రయాణికులు, యాత్రికులు పుణ్యక్షేత్రాలకు వస్తుంటారన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

రెండో పంటకు సిద్ధంగా..


రుద్రవరం వద్ద నాటు వేసేందుకు మడిని సిద్ధం చేసిన దృశ్యం


సర్పాపురం వద్ద వరి కోత కోస్తున్న యంత్రం

రుద్రవరం: మండలంలో రైతులు రెండో పంటగా వరి సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే నారుమడులను సిద్ధం చేశారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో బోరు మోటార్లు, చెరువులు, కుంటలు,తెలుగుగంగ కాల్వల కింద ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 8వేల హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం తెలుగుగంగ కాల్వల ద్వారా సకాలంలో నీరందించింది.ప్రస్తుతం పంట కాలం పూర్తి కావడంతో సర్పాపురం, ఆలమూరు, చిత్రేనిపల్లె, రుద్రవరం ,ముకుందాపురం తదితర గ్రామాల పరిధిలో కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ధాన్యం దిగుబడులను విక్రయించుకుంటూనే రెండో పంటగా వరి సాగు చేసే పనుల్లో బిజీగా ఉన్నారు. పలుచోట్ల ఇప్పటికే నాట్లు వేసేందుకు నారును అందుబాటులో ఉంచుకొని, మడులు దుక్కిదున్నుతున్నారు. బోరు మోటార్ల నుంచి నీరు పుష్కలంగా వస్తుండటంతో రెండో పంటను పండించుకోవచ్చనే ఆశతో నాట్లు వేయడానికి సిద్ధమవుతున్నామని రైతన్నలు పేర్కొంటున్నారు.